క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో పల్లకీ సేవ



శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

చాగలమర్రి: మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రం సందర్భంగా శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజ, పల్లకీ సేవను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పండితులు వెల్లాల శివ శంకర్ శాస్త్రి, ఓరుగంటి కల్యాణ శర్మ, లోకేశ్ శర్మ లు వేద మంత్రోచ్చారణలతో ఉదయం నవగ్రహ పూజ, మహిళలతో సహస్రనామ వాచనం, ప్రత్యేక పూజ జరిపించారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ఆవరణలో ప్రదక్షిణ చేపట్టారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించండి



తిరుపతి ఎంపీకి వినతి పత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): ఢిల్లీలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 3, 4, 5 తేదీల్లో జరిగిన సంసద్ సంపర్గ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రానికి చెందిన విశ్వహిందూ పరిషత్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, పోలేపల్లి సందీప్, ప్రతాపరెడ్డి పార్లమెంట్ సభ్యులకు శుక్రవారం వినతి పత్రాలను అందజేశారు. వారు మాట్లాడుతూ దేశంలోని దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని, ప్రభుత్వం పెత్తనం లేకుండా చూడాలని, ఈ అంశంపై పార్లమెంట్‌లో ప్రస్తావించాలని ఎంపీలు విజయసాయిరెడ్డి, డాక్టర్ శబరి, పురందేశ్వరి, గురుమూర్తి, మిథున్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డికి వినతి పత్రాలు అందజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ విడుదల చేస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: దిగువ అహోబిలం దేవాలయ ఆవరణలో శుక్రవారం బలిజ సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. సంఘం నాయకులు విజయకుమార్, కొల్లం పుల్లయ్య, కోనేటి చంద్రబాబునాయుడు తదితరులు ఆవిష్కరించి మాట్లాడుతూ.. అహోబిలంలో అన్నసత్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు.

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి హారతినిస్తున్న అర్చకులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీ చౌక్‌లో వెలసిన కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం అనంతరం వివిధ రకాల పూజలు నిర్వహించి అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించి పుష్పాభిషేకం చేపట్టి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవ విధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం కాళీమాత సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

పీఎం సూర్యఘర్‌పై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఏడీఏ రవికాంత్ చౌదరి

గోస్పాడు: పీఎం సూర్యఘర్ యోజన పథకంపై విద్యుత్ వినియోగదారులకు సిబ్బంది అవగాహన కల్పించాలని ఆళ్లగడ్డ విద్యుత్ ఏడీఏ రవికాంత్ చౌదరి అన్నారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం ఏఈ జ్ఞానసూర్యుడు ఆధ్వర్యంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 150 యూనిట్ల లోపు వారు ఒక కిలో వాట్‌కు, 300 లోపు యూనిట్లు వినియోగించే వారు 2కిలో వాట్స్‌కు 300 యూనిట్లు పైబడి విద్యుత్ వినియోగించేవారు 3కిలో వాట్స్ సౌరవిద్యుత్ పలకలు వేయించుకోవాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తుదారులకు రూ.30వేల నుంచి రూ.78వేల వరకు కిలో వాట్స్‌ను బట్టి ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుందన్నారు.



రుద్రవరం: తిప్పారెడ్డి పల్లె వద్ద మొలక వచ్చిన వరి ధాన్యం



చాగలమర్రి: ఆరబోసిన గింజలపై కప్పిన పట్టాలపై నిలిచిన నిటిని తోడుతున్న మహిళా రైతు



పెద్దవంగలి గ్రామంలో వరిపంటను తక్కువ ధరకు విక్రయిస్తున్న దృశ్యం



ముత్యాలపాడులో వర్షానికి తడిసి మినుము కట్టె

రైతన్నకు వాన కష్టాలు

- ఫెంగల్ తుపానుతో భారీగా నష్టపోయిన అన్నదాత
- వరి ధాన్యం కొనుగోలుకు ముందుకు రాని వ్యాపారులు
- పంట నిల్వ సౌకర్యం లేకపోవడంతో అవస్థలు
- కల్లాలోనే మొలకెత్తుతున్న ధాన్యం



తిప్పారెడ్డిపల్లె వద్ద తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



రూపనగుడి వద్ద తడిసిన వరి ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతు

రుద్రవరం/ఉయ్యాలవాడ/చాగలమర్రి: ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని రైతులను వర్షం వెంటాడుతోంది. వందలాది ఎకరాల్లో వరి పంట నేలవాలింది. కోత కోసి ఆరబోసిన ధాన్యం తడిపి ముద్దయింది. గత నాలుగు రోజుల పాటు ధాన్యంపై కప్పిన పట్టలు తొలగించకపోవడంతో అడుగు భాగం నుంచి నీరు ప్రవేశించి ధాన్యం మొలకలు వస్తున్నాయి. శుక్రవారం ఉదయం వర్షం కాస్త తెరపినివ్వడంతో రుద్రవరం మండలంలోని తిప్పారెడ్డిపల్లె, మాచినేనిపల్లె, మందలూరు, నర్సాపురం, ఆలమూరు, ఎల్లావత్తుల, కోటకొండ,రుద్రవరం,ఆర్.కొత్తూరు తదితర గ్రామాల పరిధిలోని రైతన్నలు ధాన్యంపై కప్పిన పట్టలు తొలగించి మరోచోటుకు మార్చారు. తడిసి మొలకలు వచ్చిన ధాన్యాన్ని వేరుగా ఆరబోశారు. మొన్నటి వరకు వరి ధాన్యం బస్తా రూ.1500 పలుకుగా.. ప్రస్తుతం ధాన్యం తడిసిందన్న సాకు చూపుతూ వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతున్నారని, మరి కొన్ని గ్రామాల పరిధిలో ధాన్యం కొనుగోలుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.ఈ ఏడాది ఖరీఫ్‌లో 5వేల హెక్టార్లకు పైగా వరిపంట సాగు చేశారు.

తగ్గిన దిగుబడి.. అందని గిట్టుబాటు ధర

ఉయ్యాలవాడ మండలంలో కుందూనది తీరం వెంటనున్న పది గ్రామాల్లో 1,100 హెక్టార్లలో వరి పంట సాగు చేశారు. అయితే వాతావరణ పరిస్థితులు అనుకూలించకోవడంతో దిగుబడులపై ప్రభావం పడింది. దీనికి తోడు మార్కెట్‌లో కూడా ఆశించిన మేర ధర లేకపోవడంతో వరి రైతులు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. గత నాలుగు రోజులుగా ఫెంగల్ తుపాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు అన్నదాతల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఆర్.జంబులదిన్నె, పెద్దయమ్మనూరు, ఇంజేడు, కాకరవాడ, రూపనగుడి, తదితర గ్రామాల్లో నేలవాలిన వరిని కాపాడుకునేందుకు రైతులు పడుతున్న అవస్థలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడులు పెట్టి పంటను సాగు చేశామని రైతులు పేర్కొంటున్నారు. దిగుబడులు మాత్రం 35 బస్తాలలోపు వచ్చే అవకాశం కూడా లేదని వాపోతున్నారు. దీనికి తోడు తడిసి పోయిన ధాన్యాన్ని వ్యాపారులు బస్తా రూ.1400 నుంచి రూ.1200 లోపు కొంటామని స్పష్టం చేస్తుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మండలంలో వరి పంట తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న విషయమై మండల వ్యవసాయాధికారి సుధాకర్ రెడ్డిని శుక్రవారం వివరణ కోరగా ఇప్పటి వరకు ప్రాథమిక అంచనా మేరకు వంద హెక్టార్లలో పంట దెబ్బతిన్నట్లు నివేదికలు ఉన్నతాధికారులకు పంపామని తెలిపారు.

చాగలమర్రి మండలంలో..

ఈ ఏడాది ఖరీఫ్‌లో మండలంలో వరి 2,600, మినుము 2,500, జొన్నలు 2వేల ఎకరాల విస్తీర్ణంలో సాగు చేశారు. ముత్యాలపాడు గ్రామంలో సుమారు 650 ఎకరాల విస్తీర్ణంలో చెరువు, బోర్లు, తెలుగుగంగ అయుకట్టు కింద వరి పంట సాగు చేపట్టారు. ఇప్పటి వరకు 50 శాతం మంది రైతులు పంట నూర్పిడి చేయగా, మిగిలినది కోత దశలో ఉంది. ఈ సమయంలో ఫెంగల్ తుపాన్‌తో పంట నేలవాలింది. దీంతో గింజలు రాలి, మొలకలొస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ఇక కోత పూర్తయిన వారు ఆరబెట్టుకున్న ధాన్యం తడిసి పోవడంతో మొలకలొస్తున్నాయి.

పంట నష్టం అంచనాలను తయారు చేస్తున్నాం

మండలంలో తుపాన్ తాకిడికి దెబ్బతిన్న వరి, మినుము, జొన్న తదితర పంటలను పరిశీలించాం. ప్రాథమిక అంచానాల ప్రకారం వరి పంట 526, మినుము 875, జొన్న 280 హెక్టార్ల విస్తీర్ణంలో నష్టం వాటినట్లు తేలింది. ఈ అంచానాల నివేదికను త్వరలోనే జిల్లా అధికారులకు సమర్పిస్తాం.

– రంగనేతాజీ, ఏఓ

జగనన్న పరిహారం త్వరగా అందజేసేవారు



జగనన్న ప్రభుత్వంలో ప్రకృతి వైపరిత్యాల ద్వారా పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్ట పరిహారం అందించే వారు. ఫెంగల్ తుపాను ప్రభావంతో వరి రైతులందరూ కుదేలైనా ప్రస్తుతం పట్టించుకోనే నాథుడే కరువయ్యాడు. ఇలాగైతే రైతులు వ్యవసాయం చేయడానికి ఎలా ధైర్యం చేస్తారు.

– సుబ్బారావు రైతు, ముత్యాలపాడు

లాభం లేదు



ఆరుగాలం కష్టపడి పని చేసి పంటలు పండించుకున్నా లాభం లేకపోయింది. ధాన్యం ఆరబోసుకోవడానికి, మద్దతు ధర వచ్చేంత వరకు నిల్వ ఉంచటానికి గోదాములు లేక పోవడంతో వ్యాపారులు అడిగిన ధరకు దిగుబడిని విక్రయించాల్సి వస్తుంది. దీంతో తమకు నష్టాలే మిగులుతున్నాయి. ప్రభుత్వం స్పందించి గోదాములు నిర్మించాలి. – శ్రీనివాసులు రైతు, గొడిగనూరు

వరికి మద్దతు ధర కల్పించాలి



వరి పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలి. తాను ముడెకరాల్లో వరి పంట సాగు చేశా. ఎకరాకు రూ.35వేలు వెచ్చించా. చివరకు మొత్తం వంద సంచుల దిగుబడి లభించింది. తుపాను కారణంగా ధాన్యం నిల్వ చేసుకునేందుకు వసతులు లేకపోవడంతో బస్తా రూ.1,250 ప్రకారం విక్రయించుకోవాల్సి వచ్చింది. దీంతో పెట్టుబడి కూడా రాలేదు.

– షేక్.మహబూబ్ షరీఫ్, రైతు, పెద్దవంగలి

బదిలీలు, పదోన్నతులు సర్వసాధారణం



జడ్జీని సన్మానిస్తున్న న్యాయవాదులు

నంద్యాల(వ్యవసాయం): ఉద్యోగ జీవితంలో పదోన్నతులు, బదిలీలు సర్వసాధారణమని మూడవ అదనపు జిల్లా జడ్జి వాసు పేర్కొన్నారు. శుక్రవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ పదోన్నతిపై బదిలీ అవుతున్న సందర్భంగా బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులు, గుమస్తాలు ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ పదోన్నతిపై చిత్తూరు జిల్లా పలమనేరు కోర్టుకు బదిలీ అయ్యారన్నారు. న్యాయవాదులు, సిబ్బంది సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రాధా రాణి, రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కిరణ్ కుమార్, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఏసుదాసు, న్యాయవాదులు దుర్గాప్రసాద్, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఓబులరెడ్డి, కృష్ణారెడ్డి, రాజేశ్వరి, కృష్ణప్రియ, జయశ్రీ, షన్ను, న్యాయవాద గుమస్తాలు షరత్, అమీర్, రాధాకృష్ణ, శేషఫణి పాల్గొన్నారు.

వైకుంఠ రథాన్ని అడ్డుకోలేదు

నంద్యాల(న్యూటౌన్): శ్మశాన వాటికకు వెళ్లే వైకుంఠ రథాన్ని అడ్డుకోలేదని, కావాలనే బైటిపేట పేదలను ఖాళీ చేయాలని ఆరోపణలు చేస్తున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని బైటిపేటలో కాలనీ వాసులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బైటిపేటలో 40సంవత్సరాల నుంచి నిరుపేదలు నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. అక్కడి ప్రజలు ఎలాంటి అభ్యంతరం చేయకుండా వైకుంఠ రథానికి సహకరిస్తున్నా.. కొందరు కక్ష సాధింపు చర్యలో భాగంగా కాలనీ వాసులను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. మున్సిపల్ అధికారులు స్పందించి బైటిపేట వాసులకు న్యాయ చేయాలని డిమాండ్ చేశారు. మద్దయ్య, భీముడు, సుధాకర్, మరియమ్మ, సురేష్, నాగరాజు పాల్గొన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

దొర్నిపాడు: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని లేకపోతే చర్యలు తప్పవని ఎంపీడీఓ సావిత్రి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని గుండుపాపల, డబ్ల్యూ గోవిందిన్నె, డబ్ల్యూ కొత్తపల్లె, బుర్రారెడ్డిపల్లె, చాకరాజు వేముల గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు వేయాలని సూచించారు. సచివాలయాలకు వచ్చే ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. జియోట్యాగింగ్ ఏమైనా పెండింగ్ ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రతి వ్యక్తి బ్యాంకు ఖాతాకు ఎన్‌పీసీఐ లింక్ చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం డబ్ల్యూ గోవిందిన్నెలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి గర్భిణులు, బాలింతలు, చిన్నారుల వివరాలను అడిగి గెలుసుకుని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

పాఠశాల తనిఖీ

చాగలమర్రి: మండలంలోని కలుగొట్లపల్లె మజరా గ్రామమైన నగళ్లపాడులోని ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-2 న్యామతుల్లా శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందజేయాలని సూచించారు.విద్యార్థుల విద్యాభ్యాస సామర్థ్యాన్ని వారి తల్లిదండ్రులకు తెలిపేందుకు ఈ ఏడాది నుంచి హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను అందజేయనుందని చెప్పారు.ఈ నెల 7వ తేదీన ప్రతి పాఠశాలలో మెగా పీటీసీ డే నిర్వహించేందుకు ప్రధానోపాధ్యాయులను సమయాత్త పరుస్తున్నామని చెప్పారు. హెచ్‌ఎం లలిత, ఉపాధ్యాయుడు దావూద్ ఉన్నారు.

12న రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నీ

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 12వ తేదీన నంద్యాలలో రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని, ఈనెల 8వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెస్ సంఘం నంద్యాల జిల్లా గౌరవాధ్యక్షుడు రాజేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వివిధ కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఒక్కో విభాగంలో పదవ స్థానం వరకు విజేతలుగా నిలిచిన వారికి 12 విభాగాల్లో 120 మందికి ట్రోఫీలను నంద్యాల లయన్స్‌క్లబ్ సహకారంతో అందజేస్తామని చెప్పారు. క్రీడాకారులకు భోజన వసతి ఏర్పాటు చేస్తున్నట్లు బేతంచెర్ల పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేష్ తెలిపారు. వివరాలకు సెల్ 9010451585 నంబరులో సంప్రదించాలని కోరారు.

నేరరహిత జిల్లాగా మారుద్దాం



మాట్లాడుతున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

బొమ్మలసత్రం: పోలీస్‌శాఖలో పనిచేసే ప్రతి ఉద్యోగి సమష్టి కృషితో నంద్యాలను నేర రహిత జిల్లాగా మారుద్దామని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సమావేశ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ గడిచిన మూడు నెలలుగా జిల్లాలో జరిగిన నేరాలపై సమీక్ష సమావేశం నిర్వహించి, వివిధ రకాల నేరాలకు సంబంధించిన కేసుల్లో ఎలా పురోగతిని సాధించాలో సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, కోర్టుకు సమర్పించాల్సిన ఆధారాలపై అడిగి తెలుసుకుని, సైబర్‌క్రైమ్ కేసుల్లో పురోగతితో పాటు ప్రజలకు ఇప్పటికే అవగాహన కల్పించిన కార్యక్రమాలపై ఆరా తీశారు. అరెస్టులు, చార్జ్‌షీట్లు, సమన్లు, నాన్‌బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉంచుకోకుండా సత్వరమే పరిష్కారం చూపాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్‌బాబు, డీఎస్పీలు రామాంజినాయక్, శ్రీనివాసరెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంవీ ఆర్‌పీఎస్ నాయకులు



గోస్పాడులో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఎంవీ ఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న తెలిపారు. అంబేడ్కర్ 68వ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక బొమ్మలసత్రం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి సంఘం నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చాగలమర్రి: అంబేడ్కర్ వర్ధంతిని మండల కేంద్రంలో మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక కేరళ ఆసుపత్రి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి సంఘం మండల అధ్యక్షుడు కమటం నాగేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. నీతమ్మ, వసంతరావు, కొత్తమాసి ఏసేపు, బలరాం పాల్గొన్నారు.

గోస్పాడు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అని ఎంపీపీ ఆర్థర్‌సైమాన్ అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ అమానుల్లా ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈఓఆర్డీ నాగఅనసూయ, ఎమ్మార్పీఎస్ నాయకుడు నాగమద్దిలేటి పాల్గొన్నారు.

నంద్యాల(న్యూటౌన్): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ వర్ధంతిని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్ నాయక్ మాట్లాడారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.




అంబేడ్కదర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


నంద్యాల(వ్యవసాయం): నందమూరినగర్ నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ఆవాసియా విద్యాలయ హాస్టల్‌లో శుక్రవారం బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఏపీఎస్ఈటీసీఆర్ మాజీ సభ్యురాలు రాజేశ్వరమ్మ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. స్టార్ సొసైటీ కార్యదర్శి సుబ్బరాయుడు, నాగలక్ష్మి, సౌజన్య, లక్ష్మి, రాజు, రేవతి పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్): స్థానిక ఎస్వైవీసీపీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థి, యువజన, న్యాయవాదులు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బాబాసాహెబ్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డెమోక్రటిక్ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్, డీవైఈఓ సునీత, ప్రొఫెసర్ నిరంజన్, శివకృష్ణయాదవ్, అరుణ్‌కుమార్, జీవన్‌రాజు, పుల్లన్న పాల్గొన్నారు. అలాగే.. వైఎస్సార్‌సీపీ నాయకులు అనిల్‌అమృతరాజు, కారురవికుమార్ ఆధ్వర్యంలో బొమ్మలసత్రం వద్ద నున్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



ఆళ్లగడ్డ: అర్జీలు స్వీకరిస్తున్న హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య



గొడిగనూరులో అర్జీలను స్వీకరిస్తున్న బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్‌హుసేన్

ఆళ్లగడ్డ : భూ సమస్యలకు సత్వర పరిష్కారం చూపెందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి, హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య తెలిపారు. తహసీల్దార్ రత్నకుమారి అధ్యక్షతన ఆర్.కృష్ణాపురం, మర్రిపల్లె గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు

దొర్నిపాడు:భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న గ్రామ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పండల ప్రత్యేకాధికారి గోవిందనాయక్ సూచించారు. శుక్రవారం మండలంలోని అర్జునాపురం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ముందుగా గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించి రెవెన్యూ సదస్సులపై అవగాహన కల్పించారు. వివిధ భూసమస్యలకు సంబంధించి 22 అర్జీలను రైతుల నుంచి స్వీకరించినట్లు తహసీల్దార్ సుభద్ర చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ మాధవ్, మండల సర్వేయర్ నాగప్రసాద్, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, వీఆర్‌ఓ నారాయణస్వామి, జూనియర్ అసిస్టెంట్ చిన్నగోవిందు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

శిరివెళ్ల: మండలంలో శుక్రవారం రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయి. మొదటి రోజున చెన్నూరులో సదస్సు జరిగింది. రైతులు తమ భూముల పట్టాలు, కొలతలు కొలవాలని అధికారులకు అర్జీలు అందచేశారు. తహసీల్దార్ పుష్పకుమారి మాట్లాడుతూ 10వ తేదీన బోయలకుంట్ల, 12న యర్రగుంట్ల, 13న కామినేనిపల్లె, 17న జీనేపల్లెలో, 18న గుంప్రమాన్‌దిన్నె, 19న మహదేవపురం, గుండంపాడు, 20న గంగవరం, 24న గోవిందపల్లె, 27న కోటపాడు, 31న వనికినిదిన్నెలలో సదస్సులుంటాయని వివరించారు.

ఉయ్యాలవాడ : రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు కోరారు. శుక్రవారం మండలంలోని తుడుమలదిన్నె గ్రామంలో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో 500 మంది రైతులకు సంబంధిచి 2,382 ఎకరాల విస్తీర్ణంలో భూ సర్వే నిర్వహించాల్సి ఉందన్నారు. గ్రామంలో ఎస్సీ, బీసీ కాలనీలను పంచాయతీ కార్యదర్శితో కలిసి రెవెన్యూ అధికారులు సందర్శించారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు, మండల సర్వేయర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

చాగలమర్రి: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేక అధికారి జాకీర్ హుసేన్ అన్నారు. శుక్రవారం మండలంలోని గొడిగనూరు గ్రామంలో సర్పంచ్ చీపాటి సంజీవరాయుడు అధ్యక్షతన, తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల సర్వేయర్ మద్దిలేటి, ఆర్‌ఐ అబ్దుల్ సత్తార్, వీఆర్‌ఓలు శిఖామణి, ఇమాంబాషా పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్): రెమండలంలోని కానాల, కొత్తపల్లె గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. సదస్సుకు ఆర్‌డీఓ విశ్వనాథ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి కొండయ్య మాట్లాడుతూ భూసమస్యలకు త్వరగా పరిష్కారం లభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీఓ సుగుణశ్రీ, డిప్యూటీ తహసీల్దార్లు రామచంద్రారావు, ఎన్నికల డీటీ శేఖర్, సహదేవుడు, శివకుమార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి



డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): రాయచోటి మండలంలోని కొత్తపల్లె ఉర్దూ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడి మృతికి బాధ్యులైన వారిని శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఫ్యాప్టో చైర్మన్ సుబ్బన్న, జనరల్ సెక్రటరీ మాధవస్వామి, అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, శివయ్య కోరారు. శుక్రవారం డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నాయకులు ప్రసాద్, మౌలాలి, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాంబశివుడు, లక్ష్మణ్ పాల్గొన్నారు.